నిష్కళంక దేశభక్తుడు నేతాజీ

వేర్వేరు ప్రాంతాల్లో ఘనంగా నివాళి

నరసరావుపేట రూరల్: బ్రిటీష్ వాళ్లకి ఎదురొడ్డి పోరాడిన నిష్కలంక దేశభక్తుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.పార్వతి అన్నారు. పాఠశాలలో నేతాజీ జన్మదినాన్ని పురస్కరించుకుని పరాక్రమ దివస్ గురువారం నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ లీడర్ ట్రైయినర్ పమ్మి వెంకటరెడ్డి మాట్లాడుతూ స్కౌట్ విద్యార్థులు ప్రతిరోజు మంచి పనిచేస్తూ, క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో దేశానికి సేవ చేస్తూ దేశభక్తిని అలవర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మామిళ్ల కృష్ణయ్య, ఉపాధ్యాయులు మంచి కాంతి తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట ఈస్ట్: స్వాతంత్ర సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ, రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించి భారతదేశ గడ్డపై స్వాతంత్రానికి పూర్వమే జాతీయ పతాకాన్ని ఎగురవేసిన యోధుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి యడ్లపాటి రాధ, విద్యార్థులు పాల్గొన్నారు.



వినుకొండలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘ్ నాయకులు

కృష్ణవేణి కళాశాలలో..

స్వతంత్ర భారతావని సాధన దిశగా సాహసోపేత అడుగులు వేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేషనల్ ఐకాన్‌గా నిలిచారని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. నేతాజీ జయంతిని పురస్కరించుకొని గురువారం కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో పరాక్రమ దివస్‌ను ఘనంగా నిర్వహించిన బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ ఎంఆర్‌కె సతీష్‌బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ యోగేశ్వరరావు, జె.మల్లేశ్వరీ, కె.శ్రీదేవి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని బోస్ బొమ్మ సెంటర్ వద్ద ఉన్న సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి రాష్ట్ర స్వయం సేవక సంఘ్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ గుంటూరు విభాగ్ వ్యవస్థ ప్రముఖ వక్త కొత్తమాసు రవి మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ జరిపినటువంటి పోరాట విశేషాలు గురించి వివరంగా తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ సభ్యులు, హిందూ బంధువులు పాల్గొని వారికి ఘనంగా పుష్పాంజలి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ పెద్దలు వినుకొండ ఖండ కార్యవాహ ఇమ్మడిశెట్టి మల్లికార్జున, గట్టుపల్లి కాశి, అయితా రామారావు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మిత్తింటి కృష్ణాంజనేయులు, దేవతి పెద్ద నరసింహారావు, కొల్లిపర నాగేశ్వరరావు, కొప్పురావూరి కోటేశ్వరరావు, బండి వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఎస్ ప్రచార ప్రముఖ్ గోనుగుంట్ల లక్ష్మీ రాజేష్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

చిలకలూరిపేట: అమరుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అని రోటరీ జిల్లా గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని భాస్కర్‌సెంటర్‌లో ఉన్న సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతాజీ తన జీవితాన్ని దేశం కోసం అంకితం చేశారని కొనియాడారు. నాకు మీ రక్తాన్ని ఇవ్వండి... నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను అంటూ స్వతంత్ర్య సంగ్రామం వైపు ప్రజలను ఉత్తేజ పూరితంగా నడిపారని పేర్కొన్నారు. భారత దేశ ప్రజానీకానికి ఆయుధాలతో పోరాడడం తెలుసని ప్రపంచానికి చాటి చెప్పిన పోరాటయోధుడు నేతాజీ అని వెల్లడించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఆళ్ల వేమనరెడ్డి, కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, పాల్గొన్నారు.

యడ్లపాడు: భరతజాతి విముక్తి కోసం తన ప్రాణాలసైతం పణంగా పెట్టి స్వేచ్ఛ స్వతంత్రాలను అందించిన మహోన్నత వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు వేగేసిన అంజిరాజు చెప్పారు. యడ్లపాడు గ్రామంలో గురువారం నేతాజీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షులు తులా బందుల సత్యనారాయణ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఐలవరపు రామారావు, రావూరి సుబ్బారావు, బందెల శ్రీనివాసరావు, సూరంశెట్టి వెంకటేశ్వర్లు, సయ్యద్ అల్లభక్షు పాల్గొన్నారు.

26న అంబేద్కర్ జీవిత చరిత్రపై పుస్తకావిష్కరణ

నాదెండ్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న ఆవిష్కరించనున్నట్లు హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు చెప్పారు. సాతులూరు గ్రామంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రచించిన పుస్తకాన్ని గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాయంత్రం 5.30 గంటలకు జరిగే పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన మండలి చైర్మన్ మోషేనురాజు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఏపీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, పలువురు హాజరుకానున్నట్లు చెప్పారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

నరసరావుపేట రూరల్: తనపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను అరెస్ట్ చేయకుండా రూరల్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని యల్లమంద పంచాయతీ పరిధిలోని కె.ఎస్.పి. కాలనికి చెందిన అన్నపురెడ్డి మంగయ్య తెలిపాడు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత నెల 3వ తేదీన పట్టణం నుంచి ఇంటికి వెళ్తున్న తనపై నలుగురు వ్యక్తులు విద్యానగర్‌రోడ్డులో దాడి చేశారని తెలిపాడు. కర్రలతో దాడి చేయడంతో కాళ్లు, చేతులు విరిగాయని, తీవ్ర గాయాలతో సుస్మిత ఆర్థో అండ్ ట్రామా కేర్‌లో చేరిన తనకు రెండు శస్త్ర చికిత్సలు జరిగాయని వివరించారు. దీనిపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అయితే ఇప్పటి వరకు నిందితులను అరెస్ట్ చేయలేదని తెలిపారు. దీనిపై రూరల్ ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. రూరల్ పోలీసులను న్యాయం చేయాలని కోరితే వారి నుంచి నిర్లక్ష్యంగా, దురుసుగా సమాధానం చెబుతున్నారని వాపోయాడు. ఇప్పటికీ గుర్తుతెలియని వ్యక్తులు తన ఇంటి వద్ద తిరుగుతూ భయాందోళనలు కలిగిస్తున్నారని తెలిపారు. తనకు ప్రాణహాని ఉందని చెప్పినా పోలీసులు పట్టించుకోవడం లేదని తెలిపాడు.

క్లుప్తంగా

ఏడు సెల్‌ఫోన్లు అందజేత



వినుకొండ(నూజెండ్ల): సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఏడుగురు వ్యక్తులకు రికవరీ చేసి అందించినట్లు ఐనవోలు మండలం ఎస్ఐ బి.వి.కృష్ణారావు గురు వారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారందరు తగిన ఆధారాలతో పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేస్తే సాంకేతిక పరిజ్ఞానంతో రికవరీ చేస్తామన్నారు. ఇందులో భాగంగా బ్రహ్మం, మారెళ్ళ శ్రీనివాస్ రెడ్డి, ముత్తినేని వెంకట నారాయణ, తదితర వారందరు పోగొట్టుకున్న వారందరి సెల్‌ఫోన్లు ఎస్సై అందజేశారు.

పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

వినుకొండ (నూజెండ్ల): ప్రభుత్వం అందించే సౌకర్యాలతో విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులపై ఉందని ఎస్ఆర్పీ జె.ఎస్.రాజు అన్నారు. గురువారం మండల కేంద్రమైన నూజెండ్లలోని జిల్లా పరిషత్, కస్తూరిబా గురుకుల పాఠశాల్లో సామాజిక తనిఖీ బృందాలు గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాల్లో మెరుగైన సౌకర్యాలు రూపకల్పనకు విద్యార్థులు తల్లిదండ్రులు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన రికార్డులు, నిర్వహణ, బడి మానేసిన విద్యార్థులు వివరాలు, బడిలో చదువుతున్న విద్యార్థులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో రవిచంద్ర, హెచ్ఎం శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఉషారాణి, డీఆర్పీలు డేవిడ్‌రాజు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆట స్థలం ప్రారంభం



రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గల మోడల్ స్కూల్‌లో పీఎం శ్రీ నిధులతో అభివృద్ధి చేసిన ఆటస్థలాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఎం శ్రీ నిధులతో 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్, రెండు కబడ్డీ కోర్టులను అభివృద్ధి చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పీఎం శ్రీ నిధులతో అభివృద్ధి పరిచిన 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్, కబడ్డీ కోర్టులను ఉపయోగించుకుని విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడల పోటీల్లో గెలిచి, పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ వి.రామిరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేటలో రోటరీ సేవా కార్యక్రమాలు



చిలకలూరిపేట: సేవకు ప్రతి రూపం రోటరీ క్లబ్ అని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి చెప్పారు. రోటరీ జిల్లా గవర్నర్ అధికార పర్యటనలో భాగంగా క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. రోటరీ ఉచిత ఆరోగ్య కేంద్రానికి మందులను అందజేశారు. వృద్ధాశ్రమానికి బియ్యం బస్తాలు అందించారు. మండలంలోని మురికిపూడి జెడ్పీ హైస్కూల్‌లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. క్లబ్ ఆధ్వర్యంలో ఉప్పుమాగులూరు జెడ్పీ హైస్కూల్‌లో నిర్మించిన బాలికల మురుగుదొడ్లు, వాష్ ట్యాప్స్ ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఆళ్ల వేమనరెడ్డి, కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, డైరెక్టర్లు కాపు వెంకటరావు, చిలుకూరి శ్రీనివాస్, హరిదాసుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించండి

నాదెండ్ల: విద్యార్థులు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయిశ్వేత చెప్పారు. సాతులూరు రెండో హెల్త్ సబ్ సెంటర్‌లో గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించటంతో పాటూ పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కావేరి, ఏఎన్ఎం రాజేశ్వరి, డీఈవో పవన్ కుమార్, సీవో కొల్లిపాక సాంబశివరావు పాల్గొన్నారు.

కనపర్రులో వైభవంగా చర్చి వార్షికోత్సవం

నాదెండ్ల: కనపర్రు గ్రామంలోని పునీత మరియ జోజప్ప చర్చిలో కళ్యాణ నిశ్చితార్థ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి నిర్మించి 127 వసంతాలు పూర్తైన సందర్భంగా గురువారం జరిగిన కార్యక్రమానికి విచారణ గురువు ఫాదర్ చిన్నాబత్తిని భాగ్యయ్య హాజరయ్యారు. స్థానిక విచారణ గురువు పగడాల చిన్నప్ప ఆధ్వర్యంలో ఉదయం సమిష్టి దివ్య పూజాబలి నిర్వహించారు. కానుకలు, కొవ్వొత్తులు సమర్పించారు. రాత్రి తేరు ఊరేగింపుతో పాటూ యువత బాణాసంచా కాలుస్తూ తీన్‌మార్ వాయిద్యాలతో సందడి చేశారు. చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భారీ విద్యుత్ ప్రభ ఆకట్టుకుంది.

రామిరెడ్డి పాలెంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం

రొంపిచర్ల: మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామంలో గురువారం పశుసంవర్ధక ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 143 కోళ్లకు టీకాలు, 79 పశువులకు, లేగదూడలకు నట్టల నివారణ మందులు, 45 గొర్రెలకు బొబ్బటీకాలు, 7 ఎదకు రాని పశువులకు చికిత్సలు, 2 గేదెలకు మందగొడి ఆపరేషన్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా పాల రైతుల సంక్షేమం కోసం బయోసెక్యూరిటి చర్యల ప్రాముఖ్యత, ఫుట్‌బాత్‌లు, డిస్ఇన్ఫెక్షన్ స్ప్రేల ప్రాముఖ్యతను వివరించారు. వాటిని పాడి రైతులకు ప్రయోగాత్మకంగా చేసి చూయించారు. ఈ చర్యలు చేపట్టడం వల్ల పశువుల్లో నోటికి, కాళ్లకు వచ్చే రోగాలు, అంత్రాక్స్, బోవైన్, ప్ల్యూరో న్యూమోనియా, బ్లాక్ క్వార్టర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుండి పశువులను రక్షించుకోవచ్చు అని వైద్యాధికారి డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి తెలిపారు. పరీక్షలు అనంతరం అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగన నాగేశ్వరరెడ్డి, కుమ్మెత ఓబుల్‌రెడ్డి, సంగన రామకోటిరెడ్డి, కుమ్మెత వెంకటేశ్వరరెడ్డి, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మందులు అందిస్తున్న డీడీ రామారావు

పశుఆరోగ్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

నాదెండ్ల: పశు పోషకులు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని పశు సంవర్ధక శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రామారావు చెప్పారు. అప్పాపురం గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖ ఏడీ రాధాకృష్ణ, సర్పంచ్ ఆదినారాయణమ్మ, ఎంపీటీసీ హరిబాబు, గణపవరం పశువైద్యాధికారి సాంబశివారెడ్డితో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. 209 దూడలకు, 249 గేదెలకు, 180 గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం మందులను పశుపోషకులకు ఉచితంగా అందించారు.

క్విజ్ పోటీల్లో మద్దిరాల జేఎన్‌వీ విద్యార్థి సత్తా

చిలకలూరిపేటటౌన్: మండలంలోని మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థిని క్విజ్ పోటీల్లో సత్తా చాటాడని ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. సత్తెనపల్లిలోని పీఎంశ్రీ కేంద్రియ విద్యాలయంలో గురువారం జిల్లాస్థాయి క్విజ్ పోటీలు జరిగాయి. పల్నాడు జిల్లాలో సీబీఎస్ఐ సిలబస్ బోధించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పరీక్షా పే చర్చ అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో తమ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి గోలి లక్ష్మి మణికంఠ ద్వితీయ స్థానంలో విజేతగా నిలిచి కేవీ ప్రిన్సిపాల్ జగదీష్ గుప్తా చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థి లక్ష్మిమణికంఠతో పాటు విద్యార్థికి శిక్షణ ఇచ్చిన జేఎన్‌వీ భూగోళశాస్త్రం అధ్యాపకులు ఎం లక్ష్మణరావును ప్రిన్సిపాల్‌తో పాటు మిగిలిన అధ్యాపకులు అభినందించారు.



బహుమతి అందుకుంటున్న జేఎన్‌వీ విద్యార్థి జి లక్ష్మిమణికంఠ

ముగిసిన సామాజిక తనిఖీ గ్రామసభ

రొంపిచర్ల : మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గల పీఎం శ్రీ మోడల్ స్కూల్ లో ఈ నెల 21నుండి నిర్వహిస్తున్న సామాజిక తనిఖీ గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. సభకు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ అధ్యక్షత వహించారు. సభలో పాల్గొన్న తనిఖీ అధికారి కిషోర్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో సామాజిక తనిఖీ నిర్వహించామన్నారు. ఈ తనిఖీలో భాగంగా ప్రభుత్వ పథకాల రికార్డులు, పిల్లల ద్వారా రహస్యంగా సేకరించిన సర్వే ప్రకారం ఈ పాఠశాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఈ విషయములో గ్రామ్య గ్రామలు, తల్లిదండ్రులు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. తాను పర్యటించిన అనేక పాఠశాలల కంటే ఈ పాఠశాల ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. సభలో సామాజిక తనిఖీలో వచ్చిన అంశాలను ప్రస్తావించారు. పాఠశాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకము, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం, తదితర పథకాల అమలు, హాస్టల్లో ఉన్న రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించి, నివేదికను రూపొందించి, గ్రామ సభలో చర్చించారు. కార్యక్రమంలో ఎస్.యం.సి చైర్మన్ వి. రామిరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

26న మాంసాహారం నిషేధం

వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం వినుకొండ పట్టణంలో మాంసాహారం నిషేధించడమైందని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. జంతువధ శాలను మూసివేయాలని, మాంసం, చికెన్, చేపల దుకాణాలను మూసివేయాలని తెలిపారు. హోటల్స్, రెస్టారెంట్స్‌లో మాంసాహారాన్ని విక్రయించకూడదని హెచ్చరించారు. నిబంధనలకు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

చిలకలూరిపేట: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26వ తేదీన జంతువధ, మాంసం విక్రయాలు చేయరాదని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మాంసం దుకాణదారులు, చేపల విక్రయాలు చేసేవారు, హోటళ్లు, రెస్టారెంట్లలో మాంసాహారం విక్రయాలు నిలిపివేయాలన్నారు. ఇందుకు భిన్నంగా వ్యవహరించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

నేడు నూజెండ్ల సర్వసభ్య సమావేశం

వినుకొండ(నూజెండ్ల): నేడు నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో పి.ఉమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.


శాంతి చర్చలు జరపాలి

నరసరావుపేట: దండకారణ్యంలో జరుగుతున్న భద్రత బలగాల దాడులు నిలుపుదల చేసి మావోయిస్టులతో శాంతి చర్చలు చేసి మధ్యభారతంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎన్‌జీవో కాలనీలో పోస్టర్లను ప్రదర్శించారు. అనంతరం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు మీడియాతో మాట్లాడుతూ 2024 జనవరి నుంచి నేటి వరకు 300 మందికి పైగా ఆదివాసులు, మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపారని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... శ్రీకాకుళం జిల్లాకు చెందిన మెండా కమలాకరరావు, ఈశ్వరమ్మ, తమ ఇద్దరు కుమార్తెలతో కలిసి కుటుంబం ఉపాధి పనుల నిమిత్తం 2006లో పట్టణానికి వలస వచ్చారు. నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలోని శివస్వాతి నూలుమిల్లులో స్టోర్ కీపర్‌గా పని చేస్తూ అక్కడే క్వార్టర్స్‌లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరల్‌గా పనిచేస్తున్న తన చిన్నకుమార్తెను బైక్‌పై మంగళవారం దించి తిరిగి వెళ్తున్న క్రమంలో ఎన్ఆర్‌టీ సెంటర్ వద్ద రాగానే ఎదురుగా వెళ్తున్న కారు ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన కమలాకరరావును పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కమలాకరరావు(56) మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి




నరసరావుపేటటౌన్: రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోవటానికి నియమ నిబంధనలు పాటించక పోవటమే ప్రధాన కారణమని ట్రాఫిక్ సీఐ సిహెచ్ లోకనాథం అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని రోడ్ సేఫ్టీ కార్యాలయంలో ఐగ్రో ఇంటర్నేషనల్ స్కూల్ విద్యర్థులకు గురువారం ''రోడ్డు ప్రమాదాలు వాటి నివారణ'' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా, విశ్రాంతి లేకుండా ఎక్కువ దూరం వాహనం నడపడం, వ్యతిరేక దిశలో ప్రయాణించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించక పోవడం, అతివేగం, చుట్టూ వున్న వాహనాలను గమనించక పోవడం వలన రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు ప్రమాద బాధితులకు తగిన ధైర్యం చెప్పి, క్షతగాత్రులకు త్వరితగతిన వైద్యసహాయం అందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

పారదర్శకంగా పనులు చేయాలి

శావల్యాపురం: రీసర్వే పనులు పారదర్శకంగా జరిగేలా క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని రీసర్వే మండల నోడల్ అధికారి పి.ఎస్.రాజశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తలూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కొత్తలూరు రెవెన్యూ గ్రామ పరిధిలో 4400 ఎకరాలు భూములు రీసర్వే చేయాల్సి ఉందని రోవర్ యంత్ర పరికరాలు ద్వారా రైతులు సమక్షంలో భూములు సర్వే చేయాలన్నారు. భవిష్యత్‌లో భూ వివాదాలకు తావులేకుండా ఉండాలన్నారు. ప్రతి రోజు కనీసం 30 ఎకరాలు చొప్పున భూములు రీసర్వే చేయాలన్నారు. సర్వే ఇన్‌స్పెక్టరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా 25 మండలాల్లో 25 గ్రామాలను రీసర్వే పనులు చేయడానికి ఎంచుకున్నట్లు తెలిపారు. తొలిదశలో భూముల సరిహద్దులు, ప్రభుత్వ భూమలు గుర్తింపు తదితర పనులన్నీ ఆధునీకరణ యంత్ర పరికరాలు ద్వారా చేస్తారన్నారు. రీసర్వే పనుల్లో రైతులు రెవెన్యూ అధికారులకు సహకరించాలన్నారు.

ఉల్లాస్‌తో మహిళలను అక్షరాస్యులను చేయాలి



శావల్యాపురం: ఉల్లాస్ కార్యక్రమం ద్వారా డ్వాక్రా సంఘాల్లోని మహిళలను అక్షరాస్యులను చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐటీసీ బంగారు భవిష్యత్ వారి సౌజన్యంతో డ్వాక్రా మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ 15 సంవత్సరాల పైబడిన మహిళలకు అక్షరాస్యులను చేసి జీవన ప్రమాణాలు పెంపొందించటానికి దోహదపడుతాయన్నారు. డ్వాక్రా మహిళలు ప్రతి ఒక్కరు అక్షరాస్యులుగా చేయాలన్నదే ఉల్లాస్ ఉద్దేశ్యమన్నారు. ప్రతి గ్రామ సమాఖ్య అసిస్టెంట్స్, స్వచ్ఛ వలంటీరుగా బాధ్యతలు చేపట్టి వారి గ్రూపులోని నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి అక్షరాస్యులను చేయాలన్నారు. అనంతరం ఉల్లాస్ అవగాహన కార్యక్రమం బ్రోచర్లు అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ ప్రతినిధి శ్రీనివాసరావు, ఏపీయంలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ఆరంభించాం

సాక్షి ఎఫెక్ట్

శావల్యాపురం: ధాన్యం కొనుగోలు ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లా జాయింట్ కలెక్టరు ఆదేశాలకు అనుగుణంగా రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. రైతులు ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు. ప్రభుత్వ మద్దతు ధర మేరకు తేమ శాతం ఆధారంగా కొనుగోలు సివిల్ సప్లయ్ అధికారుల పర్యవేక్షణలో రోజువారీగా ప్రభుత్వం కేటాయించిన మిల్లర్లు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. చివరిగింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం అమ్ముకునే రైతులు రైతుసేవా కేంద్రాల్లో స్టాకు వివరాలతో కూడిన సమగ్ర వివరాలను ముందుస్తుగా ఆన్‌లైన్ నమోదు చేయించాలన్నారు. ప్రతిరోజు ధాన్యం అమ్మిన రైతుల వివరాలు ఆన్‌లైన్ నమోదు అవుతుందన్నారు. రవాణా ఖర్చు, గోనె సంచులు ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందన్నారు.

చిరు వ్యాపారి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న నాయకులు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక పట్టణంలో వినుకొండ కూరగాయల మార్కెట్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రమాదవశాత్తు మరణించిన నల్లబోతుల లక్ష్మయ్య భార్య నల్లబోతుల రమణకి రూ. 50వేలు ఆర్థిక సాయం అందజేశారు. నల్లబోతుల లక్ష్మయ్య స్వగ్రామం నరసరావుపేట. బ్రతుకు తెరువు కోసం వినుకొండకు వచ్చి నివాసం ఉంటూ తోపుడు బండి మీద కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తూ ప్రమాదవశాత్తు మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న వినుకొండ కూరగాయల మార్కెట్ యాజమాన్యం వినుకొండ కూరగాయల మార్కెట్ యూనియన్ ఆధ్వర్యంలో వినుకొండ కూరగాయల మార్కెట్ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ షేక్ నన్నేసా నల్లబోతుల లక్ష్మయ్య భార్య రమణకు రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సెక్రెటరీ ఉప్పు కృష్ణ, జాయింట్ సెక్రెటరీ డి తిరుపతి, సలహాదారులు అద్దంకి గౌస్ మొహిద్దీన్, షేక్ అహ్మద్‌పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరు అంశాలపై పోటీలు



బహుమతి అందజేస్తున్న భువనేశ్వరి

శావల్యాపురం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో ఆరు అంశాలపై పోటీలను విద్యార్థులకు గురువారం నిర్వహించారు. మొదట బహుమతి క్విజ్ పోటీల్లో శావల్యాపురం హైస్కూలు 9వ తరగతి విద్యార్థులు నాగఅఖిల్, నాగలక్ష్మి, వ్యాసరచన పోటీల్లో వేల్పూరుకు చెందిన శ్రీవల్లి, డ్రాయింగ్‌లో వినుకొండ బాలికల ఉన్నత పాఠశాల భువన హర్షత,పాటలు పోటీలు వెల్లటూరుకు చెందిన నీలానాయక్, వక్తృత్వం పోటీల్లో వేల్పూరుకు చెందిన వివేక్, నాటిక పోటీల్లో వినుకొండ గురుకల పాఠశాల విద్యార్థులు ఎంపిక కాగా ప్రోత్సాహక బహుమతులను శావల్యాపురం పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరి అందజేశారు. సదరు విద్యార్థులు అందరు శుక్రవారం జిల్లాస్థాయి పోటీలకు హాజరుకానున్నారు.